మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

ఆదివారం 15-03-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 145

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District



## విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609


# శబరిమలలో మహిళలకు ప్రవేశం

## యూ టర్న్ తీసుకున్న కేరళం ప్రభుత్వం



- 50 ఏళ్ల లోపు వారికి అనుమతి కుదరదు
- సుప్రీంకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

**తిరువనంతపురం,మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్**

50 ఏళ్లలోపు మహిళల్ని శబరిమల ఆలయంలోకి అనుమతించే అంశంపై కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై 10 నుంచి 50 ఏళ్లలోపు మహిళల్ని ఆలయంలోకి అనుమతించకూడదని నిర్ణయించింది. ఈ మేరకు కేరళం సీఎం పినరయి విజయన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో దీనిపై ఆమోదం లభించింది. ఈ విషయాన్ని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. భక్తుల మనోభావాలు, ఏళ్లుగా వస్తున్న సంప్రదాయాల్ని దృష్టిలో ఉంచుకుని, వాటిని కాపాడాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

-మిగతా 3 లో





# అమెరికాలో వీసా మోసాలు

- 11మంది భారతీయుల అరెస్ట్
- నేరం రుజువైతే జైలుశిక్ష తప్పదు

**వాషింగ్టన్**

అమెరికాలో కొందరు భారతీయులు అక్రమంగా నివసించేందుకు చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) ఛేదించింది. వీసా మోసానికి కుట్ర పన్నారనే ఆరోపణలపై నాలుగు రాష్ట్రాల్లో చేపట్టిన ఆపరేషన్‌లో 11 మందిని అరెస్ట్ చేసింది. సదరు వ్యక్తులు నేర బాధితులుగా డ్రామాలాడి, ఇమ్మిగ్రేషన్ పొందేందుకు సాయుధ దోపిడీలకు పాల్పడ్డారని ఎఫ్‌బీఐ ఆరోపించింది. ఎఫ్‌బీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ముఠా ప్రణాళికలో భాగంగా మసాచుసెట్స్ రాష్ట్రంలోని లిక్కర్ షాప్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కన్వీనియెన్స్ స్టోర్లలో నకిలీ దోపిడీలు జరుగుతాయి. ఈ డ్రామాలో ఓ వ్యక్తి ఆయుధంతో షాపులోకి ప్రవేశించి అక్కడి గుమాస్తాను బెదిరించి నగదుతో ఉడాయించగా.. ఇదంతా సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అవుతుంది. ఈ విషయం కాస్త ఆలస్యంగా పోలీసులకు తెలుస్తుంది. ఆ తర్వాత దొంగ దొరక్కుండా జాగ్రత్తపడతాడు. స్టోర్‌లో దోపిడీ నిర్వహించేందుకు యజమాని, అలాగే బాధితుడిగా నటించినందుకు గుమాస్తాకు డబ్బులు చెల్లిస్తారు. ఈ డ్రామా అంతా పూర్తయ్యాక తామే ఈ దోపిడీ చేశామని పోలీసులకు సమాచారమిచ్చి.. ఆ సాక్ష్యాలతో 'యు' నాన్ ఇమిగ్రెంట్ వీసాకు దరఖాస్తు చేసుకుంటుంటారు. అయితే.. మొత్తం వ్యవహారాన్ని రాంభాయ్ పటేల్ అనే

-మిగతా 3 లో

# గ్యాస్ పై ప్రజలు ఆందోళన వద్దు

## కొరత సమస్య లేకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు

- మంత్రుల బృందం, ప్రత్యేక అధికారుల బృందాలు నిరంతర పర్యవేక్షణ
- కష్టం, నష్టాన్ని తగ్గించేందుకు ముమ్మర ప్రయత్నాలు
- సరఫరా వ్యవస్థల పునరుద్ధరణ, బలోపేతానికి కృషి
- వంట గ్యాస్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు
- ఆసుపత్రులు, హాస్టళ్ల కార్యకలాపాలకూ ప్రాధాన్యం
- రియల్ టైమ్ డేటా విశ్లేషణతో ప్రణాళికాయుత చర్యలు
- బ్లాక్ మార్కెటింగ్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు
- వదంతులను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి
- రాష్ట్ర మంత్రులు కేశవ్, అచ్చెన్నాయుడు, మనోహర్

**విజయవాడ,మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్**

రాష్ట్రంలో వంట గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజలకు ఇబ్బంది లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని, మంత్రుల బృందం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శనివారం కానూరులోని పౌర సరఫరాల రాష్ట్ర కార్యాలయంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కింజరాపు అచ్చెన్నాయుడు, వర్చువల్‌గా నాదెండ్ల మనోహర్.. పౌర సరఫరాలు, సమాచార, పౌర సంబంధాలు, పోలీస్, విజిలెన్స్ తదితర సమన్వయ శాఖల అధికారులతో పాటు ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ తదితర ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

-మిగతా 3 లో






# పాలన ప్రక్షాళన చేశాం!

- నిబద్ధతతో పనిచేస్తాం: డిప్యూటీ సీఎం పవన్
- గతంలో సమస్యలు చెప్పుకోవడానికే జనం భయపడేవారు
- నేడు ప్రభుత్వ యంత్రాంగమే మీ వద్దకు వస్తోంది
- ఏడాదిన్నరలో గిరిజన ప్రాంతంలో 460 కిమీ రోడ్లు వేశాం
- కష్టపడే ప్రభుత్వానికి అండగా ఉంటే మరింత బాగా పనిచేస్తాం
- మీరు రోడ్డుపైకి రాక ముందే వాటి పరిష్కారానికి సిద్ధం: పవన్
- అల్లూరి జిల్లా మారుమూల పల్లెలో జనసేన ఆవిర్భావ దినోత్సవం

**పాడేరు, మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్**

గత ప్రభుత్వ హయాంలో సమస్యలు చెప్పుకోవడానికి కూడా ప్రజలు భయపడేవారని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. ఎమ్మెల్యే వద్దకు వెళ్తే.. మీ ఊరు ఎక్కడుందని అడిగే పరిస్థితులుండేవని.. నేడు అందుకు భిన్నంగా సమస్యలు తెలుసుకోవడానికి, వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వ యంత్రాంగమే ప్రజల ముందుకు వచ్చేలా పాలనను ప్రక్షాళన చేశామని తెలిపారు. 'ఇచ్చిన మాట ప్రకారం ప్రజల కోసం నిబద్ధతతో పనిచేస్తాం. మాది పీపుల్స్ ఫ్రెండ్లీ ప్రభుత్వం.. మీ కష్టాలు వినడానికి, సమస్యలు తీర్చడానికి సిద్ధంగా ఉన్నాం..' అని చెప్పారు. శనివారం ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం వంట్లమామిడి పంచాయతీ నందిగరువు గ్రామాన్ని సందర్శించారు. ఆదివాసీలతో కలిసి పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకొన్నారు. వారితో 'మాటామంతీ' నిర్వహించారు.

-మిగతా 3 లో



# పెట్రోల్, డీజిల్‌లకు కొరత లేదు

- బాటిళ్లలో వాటిని సరఫరా చేస్తే కఠిన చర్యలు
- తమిళనాడు ఘటనలో డీలర్‌షి రద్దు చేసిన కేంద్రం
- ఇంధన సరఫరాలపై పెట్రోలియం శాఖ కీలక ఆదేశాలు జారీ

**న్యూఢిల్లీ,**

పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇంధన కొరత ఏర్పడుతుందంటూ జరుగుతున్న ప్రచారానికి తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ముందు జాగ్రత్తగా పెట్రోల్ , డీజిల్ ను.. సీసాలు, డబ్బాలు లాంటి విడి పాత్రలలో నిల్వ చేసుకోవడంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన జారీచేసింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. ఇటీవల తమిళనాడులోని ఒక రిటైల్ అవుట్‌లెట్‌లో వినియోగదారుడికి లూజ్ కంటైనర్‌లో పెట్రోల్ పోసిన విషయం తమ దృష్టికి వచ్చిందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది భద్రతా నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, అందుకే ఆ పెట్రోల్ బంక్ లైసెన్స్‌ను తక్షణమే సస్పెండ్ చేసి,

-మిగతా 3 లో

# గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్న కాంగ్రెస్

- దేశ ప్రయోజనాలకు భిన్నంగా కాంగ్రెస్ వైఖరి
- యుద్ధం ప్రభావం దేశంపై సాధ్యమైనంత తక్కువగా ఉండేలా కేంద్రం ప్రయత్నాలు
- అసోం ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు

**గౌహతి,**

మధ్యప్రాచ్యంలో యుద్ధం ప్రభావం దేశంపై సాధ్యమైనంత తక్కువగా ఉండేలా కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. అయితే ఇందుకు భిన్నంగా ఏమాత్రం బాధ్యతలేని విపక్షంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని ఆరోపించారు.

-మిగతా 3 లో



## మొజ్తబా ఆచూకీ చెబితే...

# 10మిలియన్ డాలర్లు

- రివార్డ్ ఫర్ జస్టిస్ ప్రకటించిన అమెరికా

**వాషింగ్టన్,**

ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎవరు పగ్గాలు చేపట్టినా తమ తదుపరి టార్గెట్ అయనే అవుతారని ఇంతకుముందే ప్రకటించిన అమెరికా ఆ దిశగా మరో ముందడుగు వేసింది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆచూకీ కానీ, ఆయనకు సంబంధించిన కీలక సమాచారం కానీ అందించిన వారికి భారీ రివార్డు ప్రకటించింది. ఆచూకీ ఇచ్చిన వారికి 10 మిలియన్ డాలర్లు అంటే రూ.92 కోట్లు నజరానా ఇస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. 'రివార్డ్ ఫర్ జస్టిస్' కార్యక్రమం క్రింద ఈ బౌంటీ ఇస్తామని తెలిపింది. అమెరికా విదేశాంగ నిర్వహించే ఒక ముఖ్యమైన ఉగ్రవాద నిరోధక కార్యక్రమమే

-మిగతా 3 లో



# శ్రీశైలంలో గవర్నర్ శుక్లా దంపతులు పూజలు



- రుద్రాభిషేకం, కుంకుమార్చనలో పాల్గొన్న గవర్నర్
- కన్నడ భక్తుల రాకతో కిటకిటలాడుతున్న క్షేత్రం

**శ్రీశైలం, మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్**

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను శనివారం తెల్లవారు జామున తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్‌శుక్లా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఈవో ఎం.శ్రీనివాసరావు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గవర్నర్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గవర్నర్ దంపతులకు దేవస్థానం అర్చకులు, పండితులు వేదాశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

-మిగతా 3 లో

# గ్యాస్ గందరగోళం లేకుండా చూడండి

- రాష్ట్ర ప్రభుత్వపరంగా ఏం చేయాలో, ఎంత చేయాలో అంతా చేయాలి
- వాస్తవ పరిస్థితికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించాలి
- మంత్రులకు సీఎం చంద్రబాబు ఆదేశం

**అమరావతి, మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్**

గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఆందోళన చెందకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు మంత్రులకు దిశానిర్దేశంచేశారు. పలువురు మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్యాస్ సరఫరా అంశంపై మంత్రులతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితిని మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యమంత్రికి వివరించారు. గ్యాస్ సరఫరా అంశంపై ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీ భేటీ అవుతున్నట్లు సీఎంకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వపరంగా ఏం చేయాలో, ఎంత చేయాలో

-మిగతా 3 లో



# మహిళతో ఉబర్ డ్రైవర్ అసభ్య ప్రవర్తన..

### అర్ధరాత్రి బైకుపై వెళ్తుండగా లైంగిక దాడికి యత్నం

న్యూఢిల్లీ-మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్
దేశ రాజధాని ఢిల్లీలో దారుణం జరిగింది. తన బైకుపై వెళ్తున్న ఒక మహిళతో ఉబర్ రైడర్ అసభ్యంగా ప్రవర్తించాడు. లైంగిక దాడికి యత్నించాడు. ఈ ఘటన ఢిల్లీలోని పితాంపుర పరిధిలో, ఈ నెల 12న అర్ధరాత్రి 1.28 గంటల సమయంలో జరిగింది. ఈ ఘటనకు పాల్పడిన ఉబర్ డ్రైవర్ అయిన నిందితుడిని సచిన్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధిత యువతి అర్ధరాత్రి సమయంలో ఢిల్లీలోని రోహిణి సెక్టార్-15 నుంచి ఎంబీ బ్లాక్ మార్కెట్ వరకు ఉబర్ రైడ్ బుక్ చేసుకుంది.బైకుపై కూర్చున్న తర్వాత నుంచి రైడర్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. కావాలని తాకడం చేశాడు. ఆమె దీనిపై వార్నింగ్ ఇచ్చినప్పటికీ



అతడు వినలేదు. ఇదే సమయంలో బైకును వేగంగా పోనిచ్చాడు. స్పీడ్ బ్రేకర్ల వద్ద కూడా వేగంగా రైడ్ చేశాడు. బైక్ నెమ్మదిగా పోనిమ్మని చెప్పినా వినలేదు. అంతేకాదు.. ఆమెను వెనుకు నుంచి పట్టుకుని లైంగికంగా వేధించే ప్రయత్నం చేశాడు. బైకు ఆపాలి అని చెప్పినా వినిపించుకోకుండా అసభ్యంగా తాకేందుకు ప్రయత్నించాడు. ఈ విషయం ఎవరికైనా చెప్పినా, గట్టిగా అరిచినా చంపేస్తానని ఆమెను బెదిరించాడు. అంతేకాదు.. వెళ్లాల్సిన రూట్‌లో కాకుండా వేరే రూట్‌లో వెళ్లాడు.దీంతో ఆమె భయాందోళనకు గురై ఏడ్వడం, గట్టిగా అరవడం మొదలుపెట్టింది. బైక్ ఆపకపోతే దూకేస్తానని హెచ్చరించింది. చివరకు ఎఫ్-యు బ్లాక్‌లోని సర్వోదయ విద్యాలయా వద్ద ఆమెను దించేసి వెళ్లిపోయాడు. అప్పటికే ఏడుస్తున్న ఆమెకు దగ్గర్లో ఉన్న సెక్యూరిటీ గార్డులు, ఇతర మహిళలు, స్కూల్ స్టాఫ్ సాయం చేశారు. వెంటనే బాధిత మహిళ ఉబర్‌లో ఈ ఘటనపై ఫిర్యాదు చేసింది. అలాగే పోలీసులకు డయల్ చేసింది. యువతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# 10 క్షిపణులు పరీక్షించిన ఉత్తర కొరియా



సియోల్: మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్
ఉత్తర కొరియా ఇవాళ తూర్పు జలాల్లోకి 10 బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించినట్లు దక్షిణకొరియా వెల్లడించింది. అమెరికాతో దక్షణికొరియా సంయుక్త సైనిక విన్యాసాల్లో పాల్గొన్న నేపథ్యంలో ఉత్తర కొరియా తాజాగా క్షిపణి పరీక్షకు పూనుకున్నది. ఉత్తర కొరియా రాజధాని ప్యోంగ్‌యాంగ్ సమీపం నుంచి ఆ క్షిపణులను ఫైర్ చేసినట్లు దక్షిణ కొరియా జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ తెలిపారు. అయితే ఆ క్షిపణులు ఎంత దూరం ప్రయానించాయో తెలియదు. ఎనకామిక్ జోన్ సమీపంలో ఆ క్షిపణులు పడినట్లు జపాన్ రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఉత్తర కొరియా నిర్వహించిన క్షిపణి పరీక్షల సమాచారాన్ని జపాన్, అమెరికాతో ఎప్పటికప్పుడు పంచుకున్నట్లు దక్షిణ కొరియా వెల్లడించింది. ఉత్తర కొరియా పరీక్షించిన క్షిపణులు సుమారు 340 కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు జపాన్ రక్షణ శాఖ వెల్లడించింది.

# పెట్రోల్ పంపులకు కేంద్రం వార్నింగ్

న్యూఢిల్లీ మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్
ఇరాన్ పై ఇజ్రాయెల్ , అమెరికా యుద్ధం నేపథ్యంలో ఇంధన కొరత ఏర్పడుతుందంటూ జరుగుతున్న ప్రచారానికి తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ముందుజాగ్రత్తగా పెట్రోల్ , డీజిల్ ను.. సీసాలు, డబ్బాలు లాంటి విడి పాత్రలలో నిల్వ చేసుకోవడంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన జారీచేసింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది.ఇటీవల తమిళనాడులోని ఒక రిటైల్ అవుట్‌లెట్‌లో




వినియోగదారుడికి లూజ్ కంటైనర్‌లో పెట్రోల్ పోసిన విషయం తమ దృష్టికి వచ్చిందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది భద్రతా నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, అందుకే ఆ పెట్రోల్ బంక్ లైసెన్స్‌ను తక్షణమే సస్పెండ్ చేసి, సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకున్నామని వెల్లడించింది. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో దేశంలోని అన్ని రిటైల్ అవుట్‌లెట్‌లు, డీలర్లకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. ఇంధనాన్ని సరఫరా చేసేటప్పుడు భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. పెట్రోల్ వంటి మండే స్వభావం ఉన్న ఇంధనాన్ని అసురక్షిత పద్ధతుల్లో నిల్వ చేయడంవల్ల తీవ్రమైన అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్రం సూచించింది.

# ఇరాన్ 'ఖర్గ్ ఐలాండ్'పై అమెరికా అటాక్



న్యూఢిల్లీ మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్
ఇరాన్ వ్యూహాత్మక ఖర్గ్ ఐలాండ్‌పై దాడి చేసినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఆ ద్వీపంలోని అన్ని సైనిక కేంద్రాలపై దాడి చేశామన్నారు. పశ్చిమాసియా చరిత్రలోనే అత్యంత భారీ దాడుల్లో ఇదొకటని ట్రంప్ అభివర్ణించారు. ట్రూత్ సోషల్ వేదికగా ఆయన స్పందిస్తూ "నా ఆదేశాల మేరకు సెంట్రల్ కమాండ్ అత్యంత శక్తివంతమైన దాడిని చేపట్టింది. ఇరాన్ మకుటంలో మణి వంటి ఖర్గ్ ఐలాండ్‌లోని ప్రతి సైనిక కేంద్రాన్ని మేము పూర్తిగా తుడిచిపెట్టాం" అని సంచలన ప్రకటన చేశారు. ఖర్గ్ ఐలాండ్ కేవలం ఒక ద్వీపం కాదు, ఇరాన్ మొత్తం చమురు ఎగుమతుల్లో సుమారు 96 శాతం ఇక్కడి నుంచే జరుగుతాయి. ప్రస్తుతానికి కేవలం సైనిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నామని 'మానవీయ కోణంలో' చమురు మౌలిక సదుపాయాలను వదిలేశానని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన 'హోర్ముజ్ జలసంధి'లో ఇరాన్ గనుక అడ్డంకులు సృష్టిస్తే.. ఒక్క క్షణంలో తన నిర్ణయాన్ని మార్చుకుని చమురు క్షేత్రాలను కూడా ధ్వంసం చేస్తానని ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

# ఫాస్టాగ్ వార్షిక పాసు మరింత ప్రియం

### ఏప్రిల్ 1 నుంచి 2.5% పెంపుదల




న్యూఢిల్లీ -మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్
ఏప్రిల్ 1 నుంచి జాతీయ రహదారులపై ప్రయాణం కాస్త భారం కానున్నది. ఫాస్టాగ్ వార్షిక పాసు ధరను 2.5 శాతం పెంచాలని కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ నిర్ణయించింది. ప్రస్తుతం వార్షిక పాసుకు రూ. 3,000 చెల్లిస్తుండగా ఏప్రిల్ 1నుంచి అది రూ. 3,075 కానున్నది. ఈ పాసు తీసుకున్న వాహన యజమానులు దేశవ్యాప్తంగా 200 టోల్ ప్లాజాల వద్ద ఆగకుండా ప్రయాణించవచ్చు.ఫాస్టాగ్ వార్షిక పాసును ప్రవేశపెట్టినపుడు నోటిఫికేషన్‌లోనే చార్జీల సవరణపై వార్షిక సమీక్ష ఉంటుందన్న నిబంధనను ప్రభుత్వం చేర్చింది. వార్షిక సవరణ ప్రక్రియలో భాగంగానే 2.5 శాతం పెంపు నిర్ణయాన్ని మంత్రిత్వశాఖ తీసుకుంది. దేశంలో 52 లక్షల మందికిపైగా ప్రజలు ఫాస్టాగ్ వార్షిక పాసును ఉపయోగిస్తున్నారు. గత ఏడాది ఆగస్టు 15న ఈ ప్రత్యేక వార్షిక పాసును ప్రభుత్వం ప్రారంభించింది. ఎన్నిసార్లయినా రీచార్జింగ్ చేసుకునే సౌలభ్యం ఉండడం ఈ పాసు ప్రధాన ఆకర్షణ. తరచూ వాహనాల్లో దూర ప్రయాణాలు చేసే వారికి ఈ పాసు చాలా లాభదాయకంగా ఉంది.

# నావిక్'కు ఎదురుదెబ్బ!

### ఐఆర్ఎన్ఎస్ఎస్ ఉపగ్రహం విఫలం



న్యూఢిల్లీ మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్
భారత స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ నావిగేషన్ విత్ ఇండియన్ కాన్‌స్టెలేషన్(నావిక్)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నావిక్‌లోని నాలుగు కార్యాచరణ ఉపగ్రహాల్లో ఒకటి విఫలమైనట్లు ఇస్రో తెలిపింది. దీన్ని ప్రయోగించిన 10 సంవత్సరాల తర్వాత ఇది విఫలమైనట్లు ఇస్రో పేర్కొన్నది. 2016 మార్చి 10న ప్రయోగించిన ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్‌కు చెందిన ఐఆర్ఎన్ఎస్ఎస్ 1-ఎఫ్ చివరి నిర్వాహక ఆటమిక్ క్లాక్(అణు గడియారం) పనిచేయకపోవడంతో అది విఫలమైనట్లు ఇస్రో వర్గాలు తెలిపాయి.దాని లోపల ఉన్న మూడు అణు గడియారాల్లో ఒకదానితో మాత్రమే ఉపగ్రహం పనిచేస్తున్నదని వారు చెప్పారు. నావిక్ వ్యవస్థ ప్రజలకు, రైల్వేలు, సైన్యం వంటి ప్రభుత్వ సంస్థలకు నావిగేషన్ సేవలను అందించడానికి కనీసం నాలుగు స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహాలు పూర్తిగా పనిచేయాల్సి ఉంటుంది.

# ఇరాన్ దాడులతో దుబాయ్ అతలాకుతలం

### షాపింగ్ మాల్స్ మూతతో పర్యాటకం బంద్



దుబయ్ మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్
దుబాయ్.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బిలియనీర్ల కలల నగరం. పెట్టుబడులకు, రక్షణకు, స్వేచ్ఛా జీవితానికి దుబాయ్ ప్రతీక. విమానయాన రంగానికి కీలక స్థానం. ఎప్పుడూ విదేశీ పర్యాటకులు, పెట్టుబడిదారులతో కళకళలాడే నగరం. అలాంటి మహా నగరాన్ని ఇరాన్ యుద్ధం కళా విహీనంగా మార్చింది. పశ్చిమాసియాలో యుద్ధం దుబాయ్ నగరంపై తీవ్ర ప్రభావం చూపించింది .యుద్ధం నేపథ్యంలో దుబాయ్ నగరం బోసిపోయింది. చాలా ప్రాంతాల్లో షాపింగ్ మాల్స్, వాణిజ్య సంస్థలను మూసేశారు. రోడ్లపై జనసంచారం లేదు. నిత్యం పర్యాటకులతో కళకళలాడే బీచ్‌లు ఖాళీగా కనిపిస్తున్నాయి. బుర్జ్ అల్ అరబ్ సహా పలు ప్రముఖ హోటళ్లు క్షిపణి దాడులకు గురి కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. చాలా మంది దేశం విడిచి వెళ్లిపోయారు.విమాన సర్వీసులు భారీగా రద్దవ్వడంతో పర్యాటక రంగమూ కుదేలైంది. డిమాండ్ పెంచడానికి హోటళ్లు భారీ డిస్కౌంట్లు ఇస్తున్నా స్పందన లేదు. సిటీ, స్టాండర్డ్ చార్టెర్డ్ తదితర అంతర్జాతీయ బ్యాంకులు తమ కార్యాలయాలను ఖాళీ చేశాయి. వీధుల్లో జనసంచారం కనిపించడం లేదు.

# నిర్బంధం నుంచి వాంగ్‌చుక్‌కు విముక్తి

### జైలు నుంచి విడుదల

న్యూఢిల్లీ మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్
ప్రముఖ పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ జోధ్‌పూర్ జైలు నుంచి విడుదలయ్యారు. జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద అతనిపై పెట్టిన కేసును కేంద్రం శనివారం ఎత్తివేసింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన మధ్యాహ్నం 1.30 గంటకు జైలు నుంచి విడుదలయ్యారు. లద్దాఖ్‌లో శాంతియుత వాతావరణం, స్థిరత్వం, పరస్పర విశ్వాసం పెంపొందించడానికి, నేతలతో అర్థవంతమైన చర్చలు జరపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హోం శాఖ తెలిపింది. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని, రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్ కింద రక్షణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేసిన ఆయనను కేంద్ర ప్రభుత్వం 2025, సెప్టెంబర్ 26న ఎన్ఎస్ఏ



చట్టం కింద అరెస్ట్ చేసి నిర్బంధించింది. తర్వాత అతడిని జోధపూర్ జైలుకు తరలించారు. దీనిపై ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో గత ఏడాది అక్టోబర్ 6న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం అతని బెయిల్‌పై సుప్రీంలో విచారణ సాగుతున్నది.

## శబరిమలలో మహిళలకు ప్రవేశం

మొదటి తరువాయి

అయితే, త్వరలోనే కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, రాజకీయ కోణంలోనే ఎల్డీఎఫ్ (లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్) ఈ నిర్ణయం తీసుకుందని రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. శబరిమల ఆలయంలోకి వయసుతో సంబంధం లేకుండా మహిళలకు ప్రవేశం కల్పించాలని కొన్నేళ్లక్రితం ఆందోళనలు చెలరేగాయి. అయితే, ఈ నిర్ణయాన్ని శబరిమల ఆలయ యాజమాన్య బాధ్యతలు చూసే ట్రావెన్‌కోర్ దేవస్తాన బోర్డు వ్యతిరేకించింది. ఎప్పటినుంచో ఉన్న సంప్రదాయం ప్రకారం.. మహిళలకు మెనుస్ట్రువల్ సైకిల్ ఉండే పదేళ్ల వయసు నుంచి 50 ఏళ్ల వయసు మహిళల్ని ఆలయంలోకి అనుమతించబోమని తెలిపింది. ఈ నిర్ణయాన్ని 2018లో ప్రభుత్వం వ్యతిరేకించింది. అన్ని వయసుల వారికి ఆలయ ప్రవేశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజ్యాంగం ఇచ్చిన హక్కు ప్రకారం అందరు మహిళలు ఆలయంలోకి వెళ్లొచ్చని తెలిపింది.

అయితే, ఇప్పుడు ఈ నిర్ణయాన్ని ఎల్డీఎఫ్ ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. పాత సంప్రదాయాల ప్రకారమే 50 ఏళ్లలోపు మహిళల ప్రవేశంపై నిషేధం విధిస్తామని కోర్టుకు తెలిపింది. ఈ అంశంలో ప్రభుత్వ నిర్ణయం ఏంటో చెప్పేందుకు తుది గడువు కావడంతో తాజా నిర్ణయాన్ని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ఈ అంశంపై వచ్చే నెల 7 నుంచి సుప్రీంకోర్టులో వాదనలు జరగనున్నాయి. మరోవైపు ప్రభుత్వం యూటర్న్ తీసుకోవడంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ఇంతకాలం ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడిన వారిపై నమోదైన కేసుల సంగతేంటని ప్రశ్నిస్తున్నాయి. ఈ నిరసనలకు సంబంధించి నమోదైన కేసుల్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది.

## అమెరికాలో వీసా మోసాలు

మొదటి తరువాయి

వ్యక్తి నడిపిస్తున్నారని తెలుస్తోంది. ఇలా వీసాలు పొందేందుకు బాధితులుగా నటించేవారు అతడికి భారీగా డబ్బులిస్తారని సమాచారం. అతడే ఈ ప్లాన్‌ను అమలు చేస్తుంటాడు. కాగా.. రాంభాయ్ పటేల్, అతడి డ్రైవర్‌ను అధికారులు ఇప్పటికే పట్టుకున్నారు. ప్రస్తుతం అరెస్టయిన వారిలో జితేంద్ర కుమార్ పటేల్, మహేశ్ కుమార్ పటేల్, సంజయ్ కుమార్ పటేల్, అమితాబెన్ పటేల్, సంగీతాబెన్ పటేల్, మితుల్ పటేల్, రమేష్‌భాయ్ పటేల్, రోనక్ కుమార్ పటేల్, సోనాల్ పటేల్, మింకేశ్ పటేల్ ఉన్నారు. వీరిని బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టులో హాజరుపరచనున్నట్టు తెలుస్తోంది. వీసా మోసానికి పాల్పడినట్టుగా నేరం రుజువైతే.. మూడేళ్ల జైలు శిక్ష, 2.50 లక్షల డాలర్లు భారత కరెన్సీలో సుమారు రూ.2.10 కోట్లు భారీ జరిమానా విధించే అవకాశం ఉంది.

## పెట్రోల్, డీజిల్‌లకు కొరత లేదు

మొదటి తరువాయి

సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకున్నామని వెల్లడించింది. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో దేశంలోని అన్ని రిటైల్ అవుట్‌లెట్‌లు, డీలర్లకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. ఇంధనాన్ని సరఫరా చేసేటప్పుడు భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. పెట్రోల్ వంటి మండే స్వభావం ఉన్న ఇంధనాన్ని అసురక్షిత పద్ధతుల్లో నిల్వ చేయడంవల్ల తీవ్రమైన అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్రం సూచించింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ తాజాగా కీలక ప్రకటన చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదని భరోసా ఇచ్చింది. కంగారు పడి కొనుగోళ్లకు దిగవద్దని ప్రజలకు సూచించింది. సాధారణ కంటెయినర్‌లలో పెట్రోల్, డీజిల్ నిల్వ చేయడం ప్రమాదకరమని హెచ్చరించింది. ఇక గృహవినియోగ ఎల్‌పీజీ సిలిండర్‌ల విషయంలో నెలకొన్న భయాందోళనలపై ఇటీవల మార్కెటింగ్ ఆయిల్ రిఫైనరీ విభాగం జాయింట్ సెక్రెటరీ కూడా స్పందించారు. ఎల్‌పీజీ డెలివరీల్లో ఎలాంటి ఆటంకాలు లేవని అన్నారు. గ్యాస్ ఉత్పత్తిని భారతీయ రిఫైనరీలు 30 శాతం మేర పెంచాయని అన్నారు. గృహ వినియోగదారులు, ఆసుపత్రులు, విద్యాసంస్థలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈ జాగ్రత్త తీసుకున్నట్టు తెలిపారు. ఇక కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌లకు సంబంధించిన వ్యవహారాల నిర్వహణను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు బదిలీ చేసింది. కీలక రంగాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సరఫరా జరిగేలా మార్గదర్శకాల రూపకల్పన, అమలు బాధ్యతలను రాష్ట్రాలకు బదిలీ చేసింది.

## గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్న కాంగ్రెస్

మొదటి తరువాయి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాంలోని సిల్చార్‌లో శనివారంనాడు పర్యటించారు. రూ.23,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.22,864 కోట్లతో సిల్చార్-మేఘాలయలోని షిల్లాంగ్ మధ్య నిర్మించనున్న యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, అస్సాం ప్రజలను హింస, ఉగ్రవాదం వైపు కాంగ్రెస్ తప్పుదారి పట్టించిందని, అయితే ఇవాళ రాష్ట్రంలో సమృద్ధిగా అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఇవాళ ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. దేశ ప్రజలపై ఆ ప్రభావం తగ్గించడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. వారి రక్షణ, శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతాయుత ప్రతిపక్షంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని ఆశిస్తాం. అయితే దేశ ప్రయోజనాల పరిరక్షణలో కాంగ్రెస్ మరోసారి విఫలమైందని విమర్శించారు. దేశంలో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. మోదీని దూషించడమే పనిగా పెట్టుకుంది. అంతర్జాతీయంగా భారత్ శీఘ్ర అభివృద్ధిని సాధించడం కొన్ని శక్తులకు ఇష్టంలేదు. అలాంటి శక్తుల చేతిలో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారిందని మోదీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీకి అస్సాం గురించి కానీ, దేశం గురించి కానీ ఎలాంటి విజన్ లేదని మోదీ తప్పుపట్టారు. మోదీని దూషించడం, అబద్ధాలు, వదంతుల ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టించడమే ఆ పార్టీకి తెలుసునని అన్నారు. బీజేపీ ప్రభుత్వం యువతకు అనేక అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆలోచనలు ఎక్కడ ఆగిపోతాయో, అక్కడి నుంచే తమ పని ప్రారంభమవుతుందని, అభివృద్ధిలో వెనుకబడిన వారికి ప్రాధాన్యత ఇవ్వడమే బీజేపీ ప్రధాన మంత్రమని చెప్పారు. మీరు కాంగ్రెస్‌ను ఇక్కడినుంచి ఎప్పుడో తరిమికొట్టారని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లోనూ ప్రతి రాష్ట్రం ఆ పార్టీకి గుణపాఠం చెప్పనుంద న్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి నిరసనలు తెలపడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. మొత్తం దేశం ఈ చర్యను ఖండించిందన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ దేశం పైనే దాడికి దిగిందన్నారు. నిరాశతో దుస్తులు చింపుకోవడం తప్ప.. వాళ్లకి మరేమీ మిగల్లేదని ఎద్దేవా చేశారు.

# గ్యాస్ పై ప్రజలు ఆందోళన వద్దు

మొదటి తరువాయి

ప్రస్తుతం రాష్ట్రంలో ఎల్‌పీజీ రోజువారీ అవసరాలు, సరఫరా స్థితిగతులతో పాటు భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. రియల్ టైమ్ డేటా విశ్లేషణ ఆధారంగా పటిష్ట కార్యాచరణతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్.. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గౌరవ ప్రధాని నేతృత్వంలో కేంద్రం, గౌరవ సీఎం నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రుల బృందంతో పాటు అధికారుల బృందాలు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ పటిష్ట కార్యాచరణతో ముందుకెళ్తూ భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. వదంతులు నమ్మవద్దని కోరారు. గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం కారణంగా, నౌకల రవాణాకు ఆటంకం వల్ల సరఫరా వ్యవస్థలో సమస్యలు ఉత్పన్నమయ్యాయని.. అయితే వ్యవస్థల పునరుద్ధరణకు, బలోపేతానికి, కొత్త మార్గాల అన్వేషణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కేంద్రం మార్గదర్శకాలతో రాష్ట్ర స్థాయిలో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇతర పెట్రోలియం ఉత్పత్తులను తగ్గించి, గ్యాస్ ఉత్పత్తిని పెంచాలని కేంద్రం దేశవ్యాప్త రిఫైనరీలను ఆదేశించిందని, దీనివల్ల ఉత్పత్తి 10 శాతం నుంచి 20 శాతం వరకు పెరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా కుటుంబాలపై ప్రభావం పడకుండా వంట గ్యాస్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. ఆసుపత్రులు, వసతిగృహాల కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గ్యాస్ సిలిండర్లపై కేంద్రం కొన్ని




పరిమితులు విధించిందని.. ప్రస్తుతానికి పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు, డబుల్ సిలిండర్లు ఉన్నవారికి 32 రోజులకు సిలిండర్ పొందేలా మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. అనవసరంగా ఆందోళనకు గురికావద్దని, కష్టాన్ని, నష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు: విపత్కర పరిస్థితులను లాభార్జన కోసం ఉపయోగించుకోవాలనే తలంపుతో ఎవరైనా బ్లాక్ మార్కెటింగ్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గౌరవ సీఎం ఆదేశాలతో ప్రత్యామ్నాయాలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే హోటళ్లు, గ్యాస్ డీలర్లు తదితర అసోసియేషన్లతో సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విపత్కర కాలంలో వివిధ రకాల వినూత్న ఆప్షన్లను ముందుకు తీసుకొస్తున్నారన్నారు. ప్రజల సలహాలు, సూచనలను కూడా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 95 శాతం ఆన్‌లైన్ బుకింగ్‌లు జరుగుతున్నాయని, 88 శాతం వరకు ఓటీపీ ఆధారిత గ్యాస్ సిలిండర్ల డెలివరీలు జరుగుతున్నాయని.. ఈ శాతాన్ని పెంచాలని సంస్థలకు సూచించామన్నారు. ఆర్‌టీజీఎస్‌తో పాటు కలెక్టర్ల కార్యాలయాల్లోనూ ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ వనరులను ఉపయోగించు కోవడంలో భాగంగా పైప్డ్ గ్యాస్‌పైనా ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్ల మంత్రి తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి దార్శనికతతో విజయవాడతో పాటు వివిధ నగరాల్లో విజయవంతంగా నడుస్తున్న పైప్డ్ గ్యాస్ నేడు వరంగా మారాయని పేర్కొన్నారు. నేచురల్ గ్యాస్‌ను సమర్థవంతంగా వినియోగించుకునే విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయం ఇప్పటికే దృష్టిసారించినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, డైరెక్టర్ శ్రీవాస్ నుపుర్ అజయ్‌కుమార్, సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్, సమన్వయ శాఖల ఉన్నతాధికారులు, చమురు సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పాలన ప్రక్షాళన చేశాం!

మొదటి తరువాయి

'కేవలం 40 కుటుంబాలున్న నందిగరువుకు సుమారు రూ.2 కోట్ల వ్యయంతో తారురోడ్డు వేయించాం. గిరి శిఖర గ్రామాల్లో గర్భిణులు డోలీ మోతలతో పడుతున్న ఇబ్బందులను చూసి కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏడాదిన్నరలో 460 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం చేపట్టాం. మీరు ఓట్లు వేసి గెలిపించిన ఎమ్మెల్యే ఏనాడైనా మీ గ్రామానికి వచ్చారా.. మీ కష్టం విన్నారా? వైసీపీ పాలనలో నిధులు మళ్లించారు. జల్ జీవన్ మిషన్‌కు విడుదలైన రూ.4 వేల కోట్లు దుర్వినియోగం చేశారు. ఈ ప్రాంతంలో కూటమి అభ్యర్థులు గెలవకపోయినా అభివృద్ధిలో ఎటువంటి వివక్షా చూపడం లేదు. ఆదివాసీల సమస్యలను పరిష్కరిస్తూ, వారి అవసరాలను తీర్చేందుకు నిబద్ధతతో కృషిచేస్తున్నాం. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన ఇటువంటిచోట్లకు వచ్చేందుకు నాయకులు భయపడతారు. కానీ ప్రజల కోసం పనిచేసే నాకు అటువంటి భయాలు లేవు. గిరిజనుల హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా అవసరమైన అన్ని అభివృద్ధి పనులూ చేసి చూపిస్తాం' అని హామీ ఇచ్చారు. పలువురు గిరిజనులు 'పవన్ కల్యాణ్‌కు జై' అని నినదించగా.. ఈ ప్రాంతంలో కూటమిని గెలిపించిన తర్వాత తనకు జేజేలు చెప్పాలని ఆయన కోరారు. నందిగరువులో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటుచేస్తామని, ఓనూరు జంక్షన్ నుంచి కొత్తపాలెం గ్రామానికి రోడ్డు నిర్మిస్తామని, అక్కడ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరుచేస్తామని తెలిపారు. అలాగే ఓనూరు, వర్తనాపల్లి గ్రామాల్లో మ్యాజిక్ డ్రెయిన్లను నిర్మిస్తామని, తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా కొళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. జీవో 3 పునరుద్ధరణ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సమస్యలు రాత్రికి రాత్రే పరిష్కారం కావని, దశల వారీగా అన్నీ పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నేత, రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజ, ఈఎన్‌సీ బాలునాయిక్, జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఎం.వెంకటేశ్వరరావు, రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత సంస్థ చైర్మన్ వంపూరు గంగులయ్య, వంట్లమామిడి సర్పంచ్ పి.రాంబాబు, గిరిజనులు పాల్గొన్నారు.




# గ్యాస్ గందరగోళం లేకుండా చూడండి

మొదటి తరువాయి

అంతా చేయాలని సీఎం సూచించారు. కేంద్రంతో సమన్వయం చేసుకుని సమస్య లేకుండా ప్రయత్నం చేయాలని ఆదేశించారు. హోటళ్లు సహా భాగస్వామ్య పక్షాలతో మాట్లాడి.. వాస్తవ పరిస్థితికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించాలని మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా చూడాలని మంత్రులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ క్యాబినెట్ సబ్ కమిటీలో మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు ఉన్నారు.



## శ్రీశైలంలో గవర్నర్ శుక్లా దంపతులు పూజలు

మొదటి తరువాయి



ఈవో వారికి స్వామి అమ్మ వార్ల చిత్రపటాలను అందజేశారు. శ్రీశైల క్షేత్ర విశేషాల గ్రంథాన్ని గవర్నర్‌కు ఈవో బహూకరించారు. గవర్నర్‌గా నియమితులు అయ్యాక శుక్లా శుక్రవారం శ్రీశైలం చేరుకున్నారు. వేకువ జామునే ఆయన ఆలయం చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇదిలావుంటే శ్రీశైలంలో భారీగా రద్దీ పెరగింది. వరు సెలవులకు తోడు కన్నడ భక్తుల రాకతో శ్రీశైలం కిటకిట.

### మొజ్తబా ఆచూకీ చెబితే...

## 10మిలియన్ డాలర్లు

మొదటి తరువాయి

'రివార్డ్ ఫర్ జస్టిస్'. ఈ ప్రోగ్రాం కింద అంతర్జాతీయ నేరస్తులు, నెట్‌వర్క్‌ల సమాచారం అందించి, వారిని పట్టుకోవడంలో సహాయపడిన వారికి మిలియన్ డాలర్ల రివార్డు ఇస్తుంటారు. అమెరికన్ల రక్షణ, జాతీయ భద్రత బలోపేతం చేయడమే ఆర్ఎఫ్‌జే లక్ష్యం.



కాగా, అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించిన వ్యక్తుల జాబితా మొజ్తాబాతో పాటు ఆయన కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అలీ అస్గర్ హెజాజీ, సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్ అలీ లారీజానీ, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. ఆచూకీ తెలిపిన వారికి రివార్డుతో పాటు వారిని వేరే ప్రాంతానికి తరలించే సదుపాయం కూడా కల్పిస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది.

మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ
డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
DREAM TIMES DAILY NEWS PAPER

## సంపాదకీయం

# అకాలజ్ఞత




కొన్ని శతాబ్దాల క్రితమే మన విష్ణుశర్మ పంచతంత్ర కథలు చెప్పాడు. అందులో మిత్రలాభం, మిత్రభేదం అనేవి మొదటి రెండు. వీటిల్లో అనేక ఉపకథలు, ఒకదానికొకటి లింకవుతూ సాగుతాయి. పిల్లలందరికీ తెలిసే ఉంటుంది. ఇప్పటికీ పంచతంత్ర కథలు చాలా ఆసక్తిగా చదివిస్తాయి. అందులో పక్షులు, జంతువులు పాత్రదారులుగా ఉన్నా, మనుషులకు వర్తించే నీతిని, ధర్మాలను, నిజాయితీలను వర్ణిస్తూ సాగుతాయి. మిత్రభేదం మొదటికథలో అడవిరాజు సింహం, ఒక పెంపుడు ఎద్దు మధ్య అసహజ స్నేహాన్ని విచ్ఛిన్నం చేయడం ఈ తంత్రం యొక్క ఇతివృత్తం. ఎద్దుతో స్నేహం కారణంగా రాజు తన ప్రజల పట్ల తన బాధ్యతలను మరచిపోయినప్పుడు, అతని మంత్రి, ఒక నక్క, ఆ స్నేహాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఒక పథకం వేస్తుంది. ఇకపోతే, మిత్రలాభంలో కూడా చాలా కథలున్నాయి. కథ చెప్తూ విష్ణుశర్మ ఇలా అంటాడు. 'సామాన్యుడు కానీ, రాజ్యాధికారి కానీ, తమ జీవిత కాలంలో మంచి మిత్రులను సంపాదించుకోవాలి. ఆపదలో ఆదుకున్నవాడే నిజమైన మిత్రుడు' అని కథలో వివరిస్తాడు. నేను కథలు వివరించను గానీ, లఘుపతనకుడనే కాకి, హిరణ్యకుడు "శత్రువులతో మైత్రి ప్రమాదకరం. కాగిన నీళ్లయినా అగ్నిని ఆర్పేస్తాయి. వైరం రెండు విధాలు. పుట్టుకతో వచ్చేది సహజవైరం. ఏదో సరిపడక వచ్చేది మామూలు వైరం. కుక్కా పిల్లి కలిసి ఉండగలవా? నీటికి నిప్పుకీ మధ్య నేస్తం కుదురుతుందా? నేను నీ ఆహారాన్ని, నువ్వు నన్ను తినేదానివి. నీకూ నాకూ స్నేహం కుదరదు" అని స్పష్టంగా చెప్పేస్తుంది ఎలుక. ఇప్పుడీ పంచతంత్ర కథల ప్రస్తావనెందుకంటే, శతాబ్దాల క్రితం చేసిన ఆలోచనలను ఇప్పుడు మన పాలకులు చేయకపోవటం, ఎంత బుద్ధిహీనత! హిరణ్యకుడి ద్వారా విష్ణుశర్మ మనకేం చెప్పాడు. ఎవరు మనకు నిజమైన మిత్రులు, ఎవరు శత్రువులు, అనే విచక్షణ ఉండాలని కదా! చెప్పింది. మరి మన నేటి పాలకులకు ఆ వివేచన ఉందా? మొత్తం ప్రపంచాన్ని, ప్రపంచ దేశాల వనరులను కాజేయడానికి, దేశాలపై దాడులు చేస్తూ విధ్వంసాన్ని, యుద్ధాన్ని సృష్టిస్తున్న సామ్రాజ్యవాద అమెరికాను మిత్రుడుగా భావించడం, దానితో మిత్రుత్వాన్ని నెరపడం కొరవితో తలగోక్కోవడం కాదా! అమెరికాతో అంటకాగుతూ యుద్ధ చిచ్చును రగిల్చిన ఇజ్రాయిల్ దేశం మనకెట్లా స్నేహితుడవుతాడు! కొన్ని తరాలుగా, చారిత్రకంగా భౌగోళికంగా మన భారతదేశానికి మిత్రునిగా ఉన్నాడు. సంస్కృతి సంప్రదాయాల కలబోతలు, ఆదాన ప్రదానాలు కలిగిన సంబంధాన్ని శత్రుసంబంధంగా మార్చే నీతిబహ్య చర్యలు, దేశ ప్రజల ప్రయోజనాలకు ఏ మాత్రం ఉపయోగపడవు. అంతేకాదు హీనచరితగా మిగిలిపోతుంది. వెనిజులాపైన అమెరికా దాడిచేసి, మదురో దంపతులను అంతర్జాతీయ న్యాయసూత్రాలనన్నింటినీ అతిక్రమించి ఎత్తుకుపోతే మన దేశ పాలకుడు మోడీ ఏమీ మాట్లాడలేదు. శాంతికోసం ఆలింగనం చేసుకునివచ్చిన మరుక్షణంలో ఇజ్రాయిల్ నెతన్యాహు ఇరాన్‌పై బాంబులు వేస్తే ఒక్కమాటా మాట్లాడలేదు. వందలాది మందిని చంపుతున్నా, ఆఖరికి ఇరాన్ దేశాధినేతను చంపినా కిమ్మనలేదు. అనేక సంవత్సరాలుగా రష్యా మనదేశానికి చౌకగా చమురు సరఫరా చేస్తుంటే, అమెరికా ఆదేశించిందని మానేసి, అమెరికా ఎక్కువ ధరకు ఇస్తున్న చమురును కొనటం ఎంత దిగజారుడుతనం. ఇప్పుడేమయింది! ఇదివరకెన్నడూ లేని కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నామని మంత్రి హర్దీప్‌సింగ్‌పురి పార్లమెంటులో ప్రకటించాడు. గ్యాస్‌బండ ధరలు పెరుగుతున్నాయి. అసలు గ్యాసు దొరకక చిన్న చిన్న వ్యాపారాలు హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడుతున్నాయి. ఐటీ ఉద్యోగులకు క్యాంటీన్‌లు లేకుండా పోయాయి. రోడ్డుపక్క మిర్చిబజ్జీల బండ్లు మూసేశారు. ఆర్డర్లు లేక స్విగ్గీ, జొమాటోలో ఉపాధి పొందుతున్నవారు రోడ్ల పాలవుతున్నారు. వాణిజ్య సిలిండర్ల కొరత దేశం మొత్తం పెరిగింది. నెతన్యాహు, ట్రంప్ మిత్రులను అడుగుతాడా సహాయం! ఇట్లాంటి యుద్ధ సమయంలో కూడా ఇంత లొంగుబాటును ప్రదర్శించినప్పటికీ, భారత్‌పై సుంకాలు పెంచుతామని అమెరికా ప్రకటిస్తున్నది. హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. చమురు నౌకలను కదలకుండా ఆపేసింది. మిత్ర దేశాలకు మాత్రం సరఫరాకు వీలు కల్పిస్తున్నట్టు ప్రకటించింది. నిన్ననే ఒక చమురు నౌక మన తీరానికి చేరుకున్నట్లు ప్రకటించారు. ఇప్పటికి కూడా మన దేశానికి ఎవరు మిత్రులు, ఎవరు శత్రువులు? తెలుసుకోకపోతే నష్టపోయేది ప్రజలు. తెలిసీ ఉన్మాదుల పక్కన చేరితే, ప్రజలు ఊరుకోరు. కొంత ఆలస్యంగానైనా మీ అసలు రూపాన్ని తెలుసుకుంటారు. ఎందుకంటే, ప్రజలు పంచతంత్ర కథలన్నీ చదువుకొని ఉన్నారు.

## ఓబులవారిపల్లెలో ఘనంగా జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**ఓబులవారిపల్లి, మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని ఓబులవారిపల్లి మండలం కటికం వారి పల్లి లో జనసేన పార్టీ నాయకులు కటికం నాగేంద్ర ఆధ్వర్యంలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, ఏఎంసీ చైర్మన్ పగడాల వరలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మొదటగా కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. అనంతరం జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర మాట్లాడుతూ జనసేన పార్టీ స్థాపించి 13 సంవత్సరాలు అయిన సందర్భంగా నేడు అంగరంగ వైభవంగా రాష్ట్రవ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్న నేపథ్యంలో రైల్వేకోడూరు ప్రతి మండలంలో ఘనంగా నిర్వహించడం జరిగిందని అందులో భాగంగానే ఈ ఓబులవారిపల్లి మండలంలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తల సమక్షంలో నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని అంతేకాకుండా 13 సంవత్సరాల పాటు పార్టీని కంటికి రెప్పలా చూసుకుంటూ ముందుకు కొనసాగిన జనసేన పార్టీ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు శ్రేయోభిలాషులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకుంటూ అంతేకాకుండా జనసేన పార్టీ అంటే ఒక అభివృద్ధి, సంక్షేమం, పేదల పాలిట వరం అనే ఒక అకుంఠిత దీక్షతో స్థాపించిన పార్టీ జనసేన అని మా దైవం దేవుడు పవన్ కళ్యాణ్ కు ఈ సందర్భంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంయుక్త, జనసేన పార్టీ నాయకులు మాదాసు నరసింహ, వర్ధన్ గారి ప్రసాద్,పగడాల వెంకటేష్, పగడాల చంద్రశేఖర్, ఎర్రం శెట్టి హరి రాయల్, గొబ్బూరి హరి, ముద్దపోలు కిరణ్,పసుపులేటి వెంకటేష్ మరియు ఓబులవారిపల్లి జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుల్లంపేట మండలం జనసేన పార్టీ కార్యాలయం నందు ఘనంగా జరిగిన జనసేన ఆవిర్భావ దినోత్సవం.

**పుల్లంపేట, మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని పుల్లంపేట మండలం జనసేన పార్టీ కార్యాలయం నందు 13వ జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన సీనియర్ నాయకులు వర్ధనగారి ప్రసాద్ ఆధ్వర్యంలో జనసేన జెండాను ఎగురవేసి కేకును కట్ చేయడం జరిగింది. పుల్లంపేట జనసేన పార్టీ సీనియర్ నాయకులు వర్ధన గారి ప్రసాద్ మాట్లాడుతూ అధ్యక్షుల వారి ఆదేశానుసారం నియోజకవర్గాలు, మండలాలలో 13వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవాలని తెలియజేయడం చాలా శుభపరిణామం అని అన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ప్రజలకు ప్రజలకు నాయకత్వం అందించిన గొప్ప నాయకుడు పవన్ కళ్యాణ్ అని అన్నారు. రైల్వే కోడూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పగడాల వరలక్ష్మి మాట్లాడుతూ యువత



పంచాయితీ గ్రామాలనుంచి పెద్ద ఎత్తున పార్టీ కార్యక్రమాలలో పాల్గొని నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అలాగే సభ్యత్వాలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంయుక్త గారు, తులసి గారు , పగడాల బ్రదర్స్, పసుపులేటి రమణ, కంబాల సురేష్,చిట్వేలు పార్టీ జనసేన నాయకులు మాదాసు నరసింహ, కంచర్ల సుధీర్ రెడ్డి, పెనగలూరు హరి రాయల్ , మస్తాన్ రాయల్ గంగన్న యాదవ్ , శంకరయ్య పార్టీ కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేశారు.

## పేద కుటుంబానికి పెద్ద కష్టం.

**శిరివెళ్ళ. ( డ్రీమ్ టైమ్స్)**
విధి వెక్కిరించింది రెక్కాడితే గాని డొక్క నిండని పేద కుటుంబానికి పెద్ద కష్టం వచ్చి పడింది, తల్లికి అంగవైకల్యం తండ్రికి మానసిక వైకల్యం ఇది చాలదన్నట్టు మానసిక వైకల్యంతో బాధపడుతున్న గూడ పోగుల ప్రవీణ్ అను వ్యక్తి విద్యుత్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రెండు చేతులు స్టమక్ పొట్టకు జాయింట్ చేసి వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. అంగవైకల్యంతో బాధపడుతూ కష్టాలను ఎదుర్కొంటున్న ఆ పేద కుటుంబం పై కాలం కన్నెర్ర చేయడంతో మానవతా దృక్పథంతో వైసీపీ యువనేత కంపరాజు రాజేష్ గౌడ్ స్పందించారు. శిరివెళ్ల మండలం మహాదేవపురం



గ్రామానికి చెందిన గూడపోవుల ప్రవీణ్ విద్యుత్ ప్రమాదంలో శస్త్ర చికిత్సలు పూర్తిచేసుకొని స్వగ్రామం అయిన శిరివెళ్ల మండలం మహాదేవపురం గ్రామానికి చేరుకోవడంతో కష్టాల్లో ఉన్న పేద కుటుంబాన్ని కంపరాజు రాజేష్ గౌడ్ పరామర్శించారు. మానవతా దృక్పథంతో స్పందించి నిత్యవసర సరుకులకు వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందించి సాటి మనిషి పట్ల మానవత్వాన్ని చాటుకున్నారు. అంగవైకల్యంతో జీవనం సాగిస్తున్న కుటుంబానికి విద్యుత్ ప్రమాదం ఆపై జరిగిన శస్త్ర చికిత్స శాపంగా మారిన పేద కుటుంబానికి కంపరాజు రాజేష్ గౌడ్ మానవతా దృక్పథంతో స్పందించడం పట్ల గ్రామ ప్రజలు అభినందించారు.

## గాజాలో కొనసాగుతున్న మారణహోమం

- **ఇజ్రాయిల్ దాడిలో మరో ఏడుగురు మృతి**

**గాజా ( డ్రీమ్ టైమ్స్)**
గాజాలో ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో మరో ఏడుగురు మరణించారు. గత మూడు రోజుల్లో ఇజ్రాయిల్ ఈ ఘాతుకానికి పాల్పడింది. శనివారం ఉదయం ఖాన్ యూనిస్‌లోని ఒక పోలీసు పోస్ట్‌పై ఇజ్రాయిల్ దళాలు దాడి చేశాయి. ఈ దాడిలో పాలస్తీనాకు చెందిన ఇద్దరు పోలీసు అధికారులు మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారు. గురువారం ఇద్దరిని, శుక్రవారం మరో ముగ్గురిని ఇజ్రాయిల్ దళాలు హత్య చేశాయని గాజా వర్గాలు తెలిపాయి. కాల్పుల



విరమణ ప్రకటించిన తరువాత కూడా ఇజ్రాయిల్ దళాలు దాడులు చేస్తూనే ఉండటంతో గత ఆరు నెలల్లో 658 మంది మరణించారు. వేలాదిమంది తీవ్రంగా గాయపడ్డారు.

**గాజాలో ఇసుక తుపాను**
గాజాలో ఇసుక తుపాను వీచడంతో శిథిలావస్థలో ఉన్న గుడారాల్లో నివసిస్తున్న కుటుంబాలు నానా అవస్థలు పడ్డాయి. చెల్లా చెదురుగా పడిపోయిన వస్తువులన్నింటినీ తిరిగి తమ గుడారానికి చేర్చుకుంటూ పెద్దలు, పిల్లలు కనిపించారు. రఫా సరిహద్దును ఇజ్రాయిల్ మూసివేయడంతో సహాయం అందక ఆకలితో గాజా వాసులు అలమటిస్తున్నారు. ఇజ్రాయిల్ దాడుల్లో తీవ్రంగా గాయపడిన వేలాదిమంది విదేశాలకు చికిత్స కోసం వెళ్లేందుకు ఎదురుచూస్తున్నారు. వారిలో పిల్లలే అత్యధికం.

# రైల్వే కోడూరులో ఘనంగా జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





## పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, ఏఎంసీ చైర్మన్ పగడాల వరలక్ష్మి

**రైల్వే కోడూరు, మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండలం పరిధిలోని స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర ఆధ్వర్యంలో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొదటగా పార్టీ కార్యాలయంలోని దేవతమూర్తుల చిత్రపటాలకు సాంప్రదాయపద్ధంగా ఏఎంసీ చైర్మన్ పగడాల వరలక్ష్మి, జనసేన పార్టీ మహిళా నాయకురాలు తాతంశెట్టి తులసి, సర్పంచ్ సంయుక్త టెంకాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జనసేన పార్టీ సీనియర్ నేతలు, నాయకులు, కార్యకర్తల తో కలిసి రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర కేక్ కట్ చేసి జై జనసేన జై జై జనసేన అంటూ నినాదాలు చేస్తూ విచ్చేసిన వారికి కేక్ ను పంచిపెట్టి, సీనియర్ నాయకులు చేత జనసేన జెండాను ఆవిష్కరింప చేయడం జరిగింది. అంతేకాకుండా ఇంద్ర బస్ షెల్టర్ వద్ద వేసవి తాపానికి ప్రజలకు దాహార్తి తీర్చడానికి పార్టీ



ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డొక్కా సీతమ్మ మంచినీటి శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది. అనంతరం తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ ఏ విధంగా మైనార్టీ సోదరులకు రంజాన్ పండుగ, క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పండుగ, హిందూ సోదరులకు సంక్రాంతి పండుగ ఎలాగో మా, మన జనసేన పార్టీ నాయకులకు ,కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు ఆవిర్భావ దినోత్సవం అనేది కూడా ఒక పండుగ. ఏదైతే పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల ఆకలి కేకల కోసం స్థాపించిన జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగిందని, ఈ ఉత్సవాలు భాగంలోనే రైల్వేకోడూరులో పూజా కార్యక్రమాలు, కేక్ కటింగ్ మరియు ప్రజల యొక్క దాహార్తి తీర్చడానికి శ్రీ డొక్కా సీతమ్మ మంచినీటి శిబిరాన్ని ఏర్పాటు చేయడం ఇలాంటి సేవా దృక్పథం ఉన్నటువంటి కార్యక్రమాలను చేయడానికి స్ఫూర్తినిచ్చినటువంటి మా దైవం మా దేవుడు పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ ద్వారా ముందుకు కొనసాగుతామని తెలియజేస్తూ, రైల్వే కోడూరు గడ్డ జనసేన పార్టీ అడ్డా అనే నిర్వచనానికి నిలువెత్తు సాక్ష్యం మా అభిమానం మా ఆప్యాయత ఇలాగే కలకాలం ఉంటుందని తెలియజేసుకుంటూ ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు నల్లంశెట్టి యానాదయ్య, నార్జాల దాశరధి, జనసేన పార్టీ బీసీ నాయకులు బత్తిన గంగయ్య యాదవ్, గంధం శెట్టి దినకర బాబు, గుగ్గిళ్ళ సుబ్బరాయుడు,ఉత్తరాది శివకుమార్, ముదపోలు సభాపతి, పగడాల చంద్రశేఖర్, పగడాల వెంకటేష్, ముత్యాల కిషోర్, తాతంశెట్టి ప్రసాద్, శ్రీ కారపు ప్రకాష్, నాగోల్ అమర్నాథ్, బీదం నవీన్ కుమార్, కొండేటి వెంకటరమణ, గిరిధర్,ముద్దపోలు కిరణ్, జడ్డా సతీష్ కుమార్ మరియు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అహోబిలం మఠం సీఈఓ గా కిడాంబి వేణుగోపాల్.



**ఆళ్లగడ్డ . (డ్రీమ్ టైమ్స్ )**
ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం మఠం నిర్వహణ అధికారిగా కీడాంబి వేణుగోపాల్ స్వామి శనివారం పదవి బాధ్యతలు చేపట్టారు. పీఠాధిపతి శ్రీ వన్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆదేశాల మేరకు అహోబిలం మఠం సీఈఓ గా ఆయన చార్జి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డకు చెందిన ప్రముఖ వైద్యులు, వెంకటసుబ్బారెడ్డి హాస్పిటల్ ఎం.డి, అహోబిలం స్వాతి వైద్యశాల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ డాక్టర్ సారెడ్డి నరసింహారెడ్డి, మేనేజర్ మాధవన్ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# అప్పలాయగుంటలో పవన్ కళ్యాణ్ పేరుతో ప్రత్యేక అర్చన

### జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్వామి సన్నిధిలో ప్రార్ధనలు



**రైల్వే కోడూరు నియోజకవర్గం మార్చ్ 14 డ్రీమ్ టైమ్స్**
తిరుపతి సమీపంలోని అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జనసేన పార్టీ స్థాపనకు 12 సంవత్సరాలు పూర్తై 13వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కొణిదెల పవన్ కళ్యాణ్ పేరుతో జనకుల గోత్రం తదితర నామాలతో స్వామి సన్నిధిలో అర్చన చేయించారు.
కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే అభయ శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో పార్టీ అభివృద్ధి, ప్రజలకు మరింత సంక్షేమం చేకూరాలని ప్రార్ధనలు చేశారు. అలాగే జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో పార్టీ మరింత బలపడాలని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు మేలు జరిగేలా సంకల్ప సిద్ధి కలగాలని కోరుకున్నారు.
ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు నియోజకవర్గానికి చెందిన జనసేన సీనియర్ నాయకులు జోగినేని మణి, మద్దెల వెంకట సుబ్బయ్య, అంకిశెట్టి మణి, మర్రి రెడ్డి ప్రసాద్, అనాలా సునీల్ కుమార్, పగడాల శివ శంకర్ తదితరులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# శ్రీ అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో జనసేన పార్టీ వేడుకలు

**రైల్వే కోడూరు, మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు జనసేన పార్టీ రాయలసీమ జోన్-1 ఎన్నికల కన్వీనర్ జోగినేని మణి ఆధ్వర్యంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు మద్దెల వెంకటసుబ్బయ్య, అంకి శెట్టి మణి, మర్రి రెడ్డి ప్రసాద్, ఆనాల సునీల్ కుమార్, పగడాల శివశంకర్ లు అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి సన్నిధిలో శనివారం జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం జోగినేని మణి మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భావితరాల భవిష్యత్తు కొరకు



2014 సంవత్సరంలో మార్చి 14వ తేదీన కొంతమంది సభ్యులతో కలిసి జనసేన పార్టీ స్థాపించడం జరిగిందని ఆనాటి నుండి ఈనాటి వరకు పార్టీ యొక్క సిద్ధాంతాలను ఆశయాలను తూచా తప్పకుండా పాటిస్తూ కార్యకర్తలుగా ప్రస్థానం మొదలుపెట్టిన మేము నేడు జనసేన పార్టీ అభివృద్ధిలో భాగమైనందుకు 13 సంవత్సరాల సుదీర్ఘ ఈ కాలంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జనసేన పార్టీ లేనిదే రాజకీయం ఉండదు అని నిరూపించిన ఏకైక నాయకుడు మా పవన్ కళ్యాణ్ అని గర్వంగా చెప్పుకోగలిగే రీతిలో జనసేన పార్టీని భారత దేశంలో 100% స్ట్రైక్ రేట్ లో నిలిపిన గొప్ప పార్టీ గొప్ప నాయకుడు నా నాయకుడు పవన్ కళ్యాణ్ అని ఈ సందర్భంగా తెలియజేస్తూ ఆయన గోత్రనామాలతో శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయన అష్ట ఐశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని వేడుకున్నట్లు తెలిపారు.

# చిట్వేల్‌లో పదో తరగతి పరీక్షలకు సర్వసిద్ధం

### -513 మంది విద్యార్థులు హాజరు కానున్నారు -- అధికారులు



**చిట్వేల్, మార్చి 14 డ్రీమ్ టైమ్స్:**
చిట్వేల్ మండలంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. మండలంలోని పరీక్షా కేంద్రాల్లో మొత్తం 513 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని వెల్లడించారు. మండలంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. ఎ సెంటర్‌లో 187 మంది, బి సెంటర్‌లో 180 మంది, సి సెంటర్‌లో 146 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, వైద్య సదుపాయం, తాగునీటి సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇన్‌విజిలేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పరీక్షల సమయంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద బయట వ్యక్తులు జోక్యం చేసుకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ--1 కాజా మొహిద్దిన్, ఎంఈఓ--2 ఈశ్వరయ్య మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

# పాళ్యం సుధాకర్ లక్ష రూపాయలు విరాళం....

### -కలియుగ కర్ణుడు పాళ్యం అంటూ కదిరి నియోజకవర్గ ప్రజలు ప్రశంసలు...

**తనకల్లు మార్చి 14 డ్రీమ్ టైమ్స్ న్యూస్..**
శ్రీమత్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవంలో ప్రమాదం అయినవారికి 50000, నల్లచెరువు కృష్ణమూర్తి భార్య డెలివరీ ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని 50000 రూపాయలు ఆర్థిక సహాయం చేసిన పాళ్యం సుధాకర్. శ్రీమత్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవంలో జరిగిన ప్రమాదం దురదృష్టకరం. ఈ ఘటనలో గాయపడి అనంతపురంలోని సిమ్స్ సవిర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పాళ్యం సుధాకర్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించడం జరిగినది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భక్తులను వ్యక్తిగతంగా కలిసి, వారి ఆరోగ్య పరిస్థితిని పాళ్యం



సుధాకర్ అడిగి తెలుసుకున్నారు. ధైర్యం చెప్పి ప్రమాదానికి గురైన వారు, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించాలని, బాధితులు త్వరగా కోలుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అక్కడి వైద్య బృందాన్ని కోరారు. కదిరి (ఖాద్రి) లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తుల మధ్య రథం కదులుతున్న సమయంలో జరిగిన ఈ ప్రమాదం అందరినీ ఆందోళనకు గురిచేసింది. ఇలాంటి సమయంలో నాయకులు స్పందించి బాధితులకు అండగా నిలిచి ప్రభుత్వం నుంచి సహాయం చేయాలని కోరారు. ఆర్థిక సాయం కావాలంటే ముందుగా గుర్తుకు వచ్చేది పాల్యశీ సుధాకర్ అని, అన్నా అంటే నేను ఉన్నాను అంటూ నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటున్న పాళ్యం సుధాకర కు ఆ కదిరి లక్ష్మి నరసింహ స్వామి ఆశీసులతో ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని ఇంకా అనేక సేవా కార్యక్రమాలు చేయాలని ప్రజలు ఆయన సేవలను ప్రశంసిస్తు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ
డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
DREAM TIMES DAILY NEWS PAPER
ఆదివారం
15-03-2026
Ananthapuram, Kurnool, Kadapa
అనంతపురం, కర్నూల్,కడప

# దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం సహాయ పరికరాల గుర్తింపు శిబిరం

-చిట్వేల్‌లో 300 మందికి పరీక్షలు
-- అర్హులకు ఆన్‌లైన్ ద్వారా పరికరాలు



**చిట్వేల్, మార్చి 14 డ్రీమ్ టైమ్స్**
దివ్యాంగులు మరియు వయోవృద్ధుల కోసం అవసరమైన సహాయ పరికరాలను గుర్తించేందుకు ప్రత్యేక శిబిరం శనివారం చిట్వేల్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించారు. తెలుగు దేశం రాష్ట్ర సంస్కృతి వ్యవహారాల డైరెక్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిట్వేల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శివప్రసాద్ గౌడ్, డాక్టర్ సల్మా, పెనగాలూరు పీహెచ్‌సీ డాక్టర్ ఎస్. తావుషీఫ్ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే చిట్వేల్ ఎంఎండీవో శ్రీనివాసులు, పెనగాలూరు ఎంఎండీవో ఎస్. విజయరావ్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుబ్బారాయుడు (లారీలు) కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చిట్వేల్ మరియు పెనగాలూరు మండలాలకు చెందిన దివ్యాంగులు, వయోవృద్ధులు దాదాపు 300 మంది ఈ శిబిరానికి హాజరై సెంట్రల్ టీమ్‌కు చెందిన వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకున్నారు. అర్హులైన దివ్యాంగులకు అవసరమైన సహాయ పరికరాలు అందించేందుకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేశారు. నడవలేని వారికి ట్రైసైకిళ్లు, చేతి కర్రలు, వాకింగ్ స్టాండ్లు వంటి పరికరాలు అందించేందుకు రిఫర్ చేశారు. శిబిరానికి వచ్చిన వారికి టీ, బిస్కెట్లు ఏర్పాటు చేశారు. అలాగే చిట్వేల్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిట్వేల్ పీహెచ్‌సీ, పెనగాలూరు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

# ‘అంకాలమ్మ’ తిరుణాలకు ఆహ్వానం



**నంద్యాల ప్రతినిధి, మార్చి 14 (డ్రీమ్ టైమ్స్):**



నంద్యాల జిల్లా గోస్పాడు మండలం సాంబవరం గ్రామంలో నిర్వహించే అంకాలమ్మ తల్లి తిరుణాల వేడుకలకు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు ఆహ్వాన పత్రి అందజేశారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో సాంబవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామస్తులు శనివారం మంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉగాది పండుగను పురస్కరించుకుని గ్రామంలో అంకాలమ్మ తల్లి తిరుణాల మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, పండుగ రోజున ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసిన “ఎద్దుల బల ప్రదర్శన” (బండ లాగుడు పోటీలను) ప్రారంభించవలసిందిగా మంత్రిని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గోస్పాడు మండల కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వర్ రెడ్డి, సాంబవరం గ్రామ మాజీ సర్పంచ్ జూపల్లి రామగోపాల్ రెడ్డి , టిడిపి నాయకులు జూపల్లి రామ భూపాల్ రెడ్డి, జూపల్లి వెంకటరమణారెడ్డి, వాల్మీకి సంఘం సభ్యులు ఎస్ ఆదినారాయణ, గోపవరం చంద్రుడు, ఎం. వెంకటయ్య చెన్నూరు నాగేంద్ర, కొత్తపల్లి నాగలింగం, కడియాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎండల ఎఫెక్ట్.. ఉపాధి కూలీ మృతి

**ఆళ్లగడ్డ**
**మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్**



ఉయ్యాలవాడ మండలం ఇంజేడులో ఉపాధి కూలీ వెంకటేశ్(51) శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. వెంకటేశ్ ఈనెల 9న గ్రామ పరిసరాల్లో నిర్వహిస్తున్న ఉపాధి సనికి వెళ్లారు. ఎండల కారణంగా అక్కడే అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోలుకోలేక శుక్రవారం మృతి చెందారు.

# సమాజ మార్పు కోసం పుట్టిందే “జనసేన”









- ప్రజలకోసం నిలబడిన నేత పవన్ కళ్యాణ్
- విలువలతో కూడిన సేవలు అందించడమే పార్టీ లక్ష్యం
-నంద్యాలలో ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

**నంద్యాల ప్రతినిధి, మార్చి 14 ( డ్రీమ్ టైమ్స్):**
ప్రజల కోసం, సమాజంలో మార్పుకోసం పుట్టిందే జనసేన పార్టీ అని, కేవలం సినీ ప్రపంచంలో కాకుండా నిజజీవితంలో సైతం ప్రజల సేవ కోసం ఆరాటపడే నాయకుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అని జనసేన పార్టీ నాయకులు భవనాశి శ్రీనివాసులు ( వాసు ) పేర్కొన్నారు. నంద్యాల పట్టణం పద్మావతినగర్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ నేత భవనాశి వాసు ఆధ్వర్యంలో పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండాను ఆవిష్కరించి జన సైనికులు, వీర మహిళల సమక్షంలో భారీ కేకు కట్ చేశారు. అంతకు ముందు ప్రథమ నందీశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం పరివర్తన లైఫ్ సెంటర్ లో విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశములో భవనాశి శ్రీనివాసులు మాట్లాడుతూ జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. ప్రజలకోసం, సమాజంలో మార్పు కోసం జనసేన పార్టీ ఉద్భవించిందన్నారు. ప్రజల సమస్యలు, రైతు సమస్యలు, యువత ఆశయాలతో పాటు ప్రజల శ్రేయస్సుకోసం ప్రత్యామ్నాయ పార్టీనీ పవన్ కళ్యాణ్ తీసుకొచ్చి ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు.



సినిమాలోనే కాకుండా నిజజీవితంలో సైతం ప్రజలకోసం నిలబడి ప్రజల నాయకుడిగా ఆదరణ పొందాలని ప్రశంసించారు. ఆయన చెప్పిన మాటలు ప్రతి ఒక్కరు పాటిస్తున్నారని, రాజకీయాలు పదవుల కోసం కాదు సేవ కోసం అని నిరూపించారన్నారు. జనసేన పార్టీ పెట్టిన 13 ఏళ్లలో ఎన్నో అవమానాలు పడ్డారని, కార్యకర్తల కష్టాలను కళ్ళారా చూశారన్నారు. పవన్ కళ్యాణ్ ఆలోచనలు, సిద్ధాంతాలు ముందుకు తీసుకొని పోతామన్నారు. జనసేన ఉద్యమి కార్యక్రమం ఈ నెల 17 వరకు కొనసాగుతుందని, సభ్యత్వం తీసుకుని వారికి అవకాశం ఉందన్నారు. మారాసు గురు బాబు మాట్లాడుతూ జనసేన పార్టీ సేవా భావాలు ప్రజల్లోకి తీసుకొని వెళ్ళడమే తమ లక్ష్యం అన్నారు. జనసేన పార్టీ ఉద్యమీ ఫిబ్రవరి 16 నుంచి మార్చి 10 వరకు ఉండేదని, అభిమానుల కోరిక మేరకు ఈనెల 17 వరకు కొనసాగుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి జనసేన పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు. పిఠాపురంలో ఆయనకు వచ్చే జీతం సైతం పేద ప్రజలకు అందించిన మహనీయుడని కొనియాడారు. రోడ్లు, పల్లె బాట,అడవి తల్లి బాటతో ముందుకు సాగుతున్నారన్నారు. దండు మురళి మాట్లాడుతూ దేశంలో కనీవిని ఎరుగని రీతిలో రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన స్థానాల్లో నూటికి నూరు శాతం విజయం సాధించిన పార్టీ ఒక్క జనసేన పార్టీ అని గుర్తు చేశారు. ప్రజాసేవలో పవన్ కళ్యాణ్ ముందుకు సాగిపోతున్నారన్నారు. సంస్థాగత ఎన్నికలకు జనసేన సైనికులు సిద్ధంగా ఉన్నారని ,మరోసారి చరిత్ర సృష్టిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. రాము మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా భాషలను గౌరవించడం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడం, అవినీతిపై రాజీలేని పోరాటం, పర్యావరణ, పరిరక్షణ, అభివృద్ధి, జాతీయ వాదంతో పాటు విలువలతో కూడిన రాజకీయం చేయడమే జన సేన పార్టీ లక్ష్యమని చెప్పారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను విస్మరించకుండా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా చేస్తున్నారని అన్నారు. రాజకీయాల్లో జవాబుదారీ తనంగా స్పందించే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. అనంతరం జనసైనికులు, వీర మహిళలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిట్వేలిలో ఘనంగా జనసేన 13వ ఆవిర్భావ వేడుకలు

విద్యార్థులకు పరీక్షా కిట్లు
-- భారీ అన్నదానం, కేక్ కటింగ్ సంబరాలు

**చిట్వేల్,మార్చి 14 (డ్రీమ్ టైమ్స్):**
జనసేన పార్టీ స్థాపనకు 13 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా చిట్వేల్ మండలంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ స్థాపకుడు కొణిదల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఏర్పడిన జనసేన పార్టీ 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో జనసైనికులు ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. ముఖ్యంగా చిట్వేల్ మండలంలో నిర్వహించిన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మండల జనసేన నాయకుడు మాదాసు నరసింహ పర్యవేక్షణలో నాగవరం హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర జనసేన పార్టీ కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన



పరీక్షా కిట్లను అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల జనసేన పార్టీ కార్యాలయంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర జనసేన పార్టీ కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్రతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి భారీ కేక్ కట్ చేసి జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో జనసైనికులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీ పట్ల తమ అభిమానాన్ని, ఐక్యతను చాటుకున్నారు. కార్యక్రమంలో కారు ముంచి సంయుక్త, తాతంశెట్టి తులసి, పగడాల వెంకటేష్, బత్తిన గంగయ్య యాదవ్, పగడాల చంద్రశేఖర్, జిలకర మురళి, మద్దూరి మన్మధ, ఎర్రంశెట్టి హరిబాబు, నార్జాల దాశరధి, తుపాకుల పెంచలయ్య, పెద్దంగారి సాయి, కంచర్ల సుధీర్ రెడ్డి, షేక్ రియాజ్, కావేరి అవినాష్, మాదాసు శివ, కొనిశెట్టి చక్రి, నల్లంశెట్టి యానాదయ్య, ముద్దపోలు సభాపతి, ముద్దపోలు రామసుబ్బయ్య, పసుపులేటి వెంకటరమణ, ఉత్తరాది శివకుమార్, శ్రీకారం ప్రకాష్, ఎర్రజన్నగారి చలపతి, సూర్యాల ధర్మయ్య, తాతంశెట్టి ప్రసాద్, దాది రామచంద్ర, మహంకాళి నాగేంద్ర, బత్యాల ఈశ్వరయ్య, బీదం నవీన్, ముద్దపోలు కిరణ్, సాదు కిషోర్, మన్నూరు రవి, కొండేటి రమణ, భూమా సుబ్రమణ్యం, పురం గోపాల్, మోడం వాసు, కొత్తపల్లి ఈశ్వరయ్య, మాదినేని రాజా, నారగట్ల గంగయ్య, సువారపు నాగేశ్వరరావు, పొన్నారెడ్డి ఆనంద్, అలసాల సాయి, బోయపల్లి నాగరాజా, ఈడికిపల్లి నాగేంద్ర, టంగుటూరు నరసింహ, నందకిషోర్, మద్దెల మహేష్ తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వివాహ కార్యక్రమం కు హాజరు అయిన కాటసాని జయమ్మ

**బనగానపల్లె, మార్చి 14, డ్రీమ్ టైమ్స్ న్యూస్**
బనగానపల్లె నియోజకవర్గం బనగానపల్లె పట్టణం ధనలక్ష్మి కళ్యాణమండపం నందు యాగంటి దేవస్థానం అర్చకులు టంగుటూరు చంద్రశేఖర శర్మ గారి కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ ..






# మరోమారు అనుష్క పెళ్లి వార్తలు

### పెళ్లి పీటలు ఎక్కనుందంటూ సోషల్ మీడియాలో హల్‌చల్

దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు 'లేడీ సూపర్ స్టార్'గా వెలుగొందిన అనుష్క శెట్టి వివాహ వార్తలు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. గత కొన్నేళ్లుగా ఆమె పెళ్లిపై అనేక ఊహాగానాలు వచ్చినప్పటికీ, ఈసారి మాత్రం ఆమె త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. 44 ఏళ్ల అనుష్క ఈ ఏడాది పెళ్లి పీటలు ఎక్కేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వరుడు ఆమె కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన బెంగళూరుకు చెందిన ఒక ప్రముఖ వ్యాపారవేత్త అని, ఇది పూర్తిగా పెద్దలు కుదిర్చిన సంబంధమని సమాచారం. ఇప్పటికే ఇరు కుటుంబాల మధ్య చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. చాలా కాలంగా అనుష్క పేరు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో కలిపి వినిపిస్తున్న ప్పటికీ, వారిద్దరూ కేవలం ప్రాణ స్నేహితులమని పలుమార్లు స్పష్టం చేశారు. తాజా పరిణామాలతో ఈ రూమర్లకు చెక్ పడే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు, అనుష్క గత చిత్రం 'ఘాటి' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె కేవలం మలయాళ చిత్రం 'కథనార్' షూటింగ్‌లో మాత్రమే పాల్గొంటున్నారు. ఈ సినిమా పనులు పూర్తయిన వెంటనే ఆమె వివాహం చేసుకునే ఛాన్స్ ఉందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.



# డిఫరెంట్ కాన్సెప్ట్ తో వస్తున్న హెబ్బా పటేల్..

టాలీవుడ్ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్లలో హెబ్బా పటేల్ ఒకరు. తక్కువ సమయంలోనే విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇప్పటివరకు సరైన బ్రేక్ రాలేదు. కానీ విభిన్న కంటెంట్ చిత్రాలు, లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తుంది. ప్రస్తుతం తన కొత్త సినిమాను ప్రారంభించింది ఈ ముద్దుగుమ్మ. అర్జున్ ఆర్ట్స్ సమర్పణలో చిత్రాలయ క్రియేషన్స్ బ్యానర్ మీద శ్రీలక్ష్మి.ఎం నిర్మాతగా ప్రొడక్షన్ నెంబర్ 3 రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాకి 'దర్జా' ఫేమ్ మ్యాక్ (సలీం మాలిక్) దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. హెబ్బా పటేల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని మేకర్లు తాజాగా ప్రకటించారు. ఎమోషన్, కామెడీ ఎంటర్టైన్మెంట్ జానర్‌లో డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రాబోతోన్న ఈ సినిమాని భారీ ఎత్తున రూపొందించబోతోన్నారు. ఈ మేరకు నటీనటులు, ఇతర సాంకేతిక బృందానికి సంబంధించిన వివరాల్ని ప్రకటించారు.దర్జా' మూవీతో అందరినీ మెప్పించిన మ్యాక్ (సలీం మాలిక్) ఈ మూవీకి స్టోరీ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ బాధ్యతల్ని నిర్వర్తించనున్నారు. ఆడియెన్స్‌కి కొత్త ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేలా, డిఫరెంట్ సబ్జెక్ట్‌లతో ఆకట్టుకునే దర్శకుడు మ్యాక్ (సలీం మాలిక్) ఈ సారి ఓ కొత్త కాన్సెప్ట్‌తో ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాడు. ఈ ప్రాజెక్ట్‌కి మాటలు, పాటల్ని భాష్యశ్రీ అందించనున్నారు. కేవీఆర్ అడిషనల్ స్క్రీన్ ప్లేని రాశారు. ఎం. సమీర్ ఈ చిత్రానికి సంగీతాన్ని సమకూర్చనున్నారు. విష్ణు పానికర్ కెమెరామెన్‌గా పని చేయనున్నారు. ఈ మూవీలో హీరోయిన్‌గా హెబ్బా పటేల్ నటించనున్నారు. మిగిలిన వివరాల్ని చిత్రయూనిట్ త్వరలోనే ప్రకటించనున్నారు.

# అదే నిజమైతే టైమ్ మొదలైనట్టే



పన్నెండేళ్ల క్రితం 'ఊహలు గుసగుసలాడే' అనే హిట్ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది ఢిల్లీ భామ రాశీఖన్నా. ఆ తర్వాత ఎన్టీఆర్, రవితేజ, ధనుష్ వంటి స్టార్లతో సినిమాలు చేసినా, అనుకున్నంత స్టార్‌డమ్ మాత్రం రాశీఖన్నాను వరించలేదు. నిజానికి అందంలోనూ, అభినయ సామర్థ్యంలోనూ నేటి స్టార్ హీరోయిన్లెవరికీ తీసిపోదు రాశీఖన్నా. కానీ ఇండస్ట్రీలో ఎదగాలంటే గుమ్మడికాయంత విద్వత్తుంటే చాలదు, ఆవగింజంత అదృష్టం కూడా ఉండాలి. ఆ అదృష్టం కోసం దశాబ్దానికి పైగా ఎదురుచూస్తూనే ఉంది ఈ అందాలభామ.ఈ నెల 19న రానున్న పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' తన కెరీర్‌కి గేమ్‌ఛేంజర్ అని ఆమె గట్టిగా నమ్ముతోంది. ఇదిలావుంటే, ఈ క్రేజీ సినిమా తర్వాత, వెంటనే మరో పానిండియా సినిమాలో రాశీఖన్నా భాగం కానున్నట్టు తెలిసింది. అల్లు అర్జున్ హీరోగా తమిళ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ ఓ భారీ పాన్ ఇండియా మూవీకి శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీమేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ మూవీలో కీలక పాత్ర కోసం రాశీఖన్నాను దర్శకుడు లోకేష్ కనకరాజ్ సంప్రదించారట. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని తెలిసింది. ఇదే నిజమైతే రాశీఖన్నా టైమ్ నిజంగా మొదలైనట్టే.




# 15న ఉస్తాద్ ప్రీరిలీజ్ వేడుకలు

### ఈవెంట్ బద్దలై పోవాలన్న హరీశ్ శంకర్

పవన్‌కల్యాణ్ అభిమానులకు మరో శుభవార్త. పవన్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర ప్రీ-రిలీజ్‌వేడుక ఖరారైంది. మార్చి 15న హైదరాబాద్ పోలీస్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 5గంటల నుంచి ఈవెంట్ మొదలవుతుందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. అలాగే దర్శకుడు హరీశ్ శంకర్ కూడా ఈ విషయాన్ని తెలియజేస్తూ 'ఈసారి ఈవెంట్ బద్దలైపోవాలి ఫ్రెండ్స్' అని పేర్కొన్నారు. ఇక శనివారం సాయంత్రం 'ఉస్తాద్' ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు స్పష్టం చేసింది. రాశీఖన్నా, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్న ఈ మూవీ మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'గబ్బర్ సింగ్' తర్వాత హరీశ్-పవన్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలు ఉన్నాయి.



# రాజ్ కుమార్ రావుతో కీర్తి సురేష్ జోడీ

### ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వంలో రఫ్తార్

బాలీవుడ్ విలక్షణ నటుడు రాజ్ కుమార్ రావు మరియు సౌత్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ తొలిసారిగా జతకట్టబోతున్నారు. వీరిద్దరి క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'రఫ్తార్'. ఇంటెన్స్ థ్రిల్లర్ డ్రామాగా రాబోతున్న ఈ ప్రాజెక్టును రాజ్ కుమార్ రావు భార్య, నటి పత్రలేఖ తన సొంత నిర్మాణ సంస్థ 'కాంపా ఫిల్మ్స్'పై అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ సమర్పణలో నిర్మించబోతుంది. విద్యా వ్యవస్థలోని చీకటి కోణాలు, కార్పొరేట్ పోటీ, సక్సెస్ కోసం ఆరాటపడే ఇద్దరు వ్యక్తుల మధ్య సాగే సంఘర్షణ నేపథ్యంలో ఈ సినిమా సాగనుంది. ముఖ్యంగా డబ్బు, అధికారం మనుషుల సంబంధాలను ఎలా మారుస్తాయనే అంశాన్ని దర్శకుడు ఆదిత్య నింబాల్కర్ ఈ థ్రిల్లర్‌లో చూపించబోతున్నారు. ఇక నేషనల్ అవార్డు గ్రహీతలైన రాజ్ కుమార్ రావు, కీర్తి సురేష్ కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరితో పాటు అనూరాగ్ ఠాకూర్, తాన్యా మణిక్తలా మరియు రజత్ కపూర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో 'సెక్టార్ 36'తో మెప్పించిన ఆదిత్య నింబాల్కర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో కథనం చాలా ఉత్కంఠభరితంగా ఉంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ భారీ చిత్రాన్ని జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831